# ఓ మహాత్మా! ఓ మహర్షీ!



భాగవతుల సుబ్రహ్మణ్యం

సాష్టాంగ పూర్వకంగా మోకరిల్లాడు మాజీ సి.ఎం. చింతాద్రి....... దేవుడి ఫోటో ముందో, గుళ్ళో విగ్రహం ఎదుటనో కాదు- సకల..రాజభోగ విలసితమై, సమస్త సౌకర్యాల కాలవాలమై, పొలిటికల్ పలుకుబడి అనే అదృశ్యహస్తాల అపురూప సంరక్షణా దక్షత దండిగా దొరకబుచ్చుకున్న దిగ్రేట్ ప.గో.బా. పాదార విందాల చెంత.

ప.గో.బా.సంపూర్ణ నామధేయం- పరమాచార్య గోవిందానందబాబా. త్రిబుల్ శ్రీయుత బహుదండి సీతాధిపతిగా ఇటీవలే ఓ గొప్ప జగద్గురు పీఠాన్ని అలంకరించి పావనం చేసారు.


అత్యధునాతన మల్టీస్టోరీడ్ ఆశ్రమం వారి నివాసం.

చపాతీని ఓ యాంగిల్లోనే సాగదీస్తే వచ్చే షేపులో ఉంటుందాయన ముఖం. వెనక్కు, దువ్వినట్టుండే జుట్టు గిరజాలు తిరిగి భుజాలు తాకుతూ, ఖరీదైన కర్ణాభరణాల్ని పలకరిస్తూంటుంది. ఫారిన్ లిక్కర్ ప్రభావం వల్ల కాబోలు.....బుంగల్లా ఉబ్బిన బుగ్గలు బవిరిగడ్డం మాటున దోబూచులాడుతుంటాయి. వొత్తయిన కనుబొమ్మలు కలిసే చోట

"సృష్టి తత్వాన్ని యదార్థంగా గ్రహించగల తత్త్వవేత్తలు, ఈ మాయామేయ జగత్తు అంతటా వ్యాపించిన చైతన్యం ఒక్కటే" అంటారు. దీనికి విపరీతార్థాన్ని తీసి పెడమార్గం పట్టించే ఓ మహాత్మా! ఓ మహర్షీ! ఎంతకాలం ఈ మాయాజాలం?....

పాత రూపాయి నాణెమంత కుంకుమ బొట్టు అరంగుళం మందానమెత్తి, చందనలేపనం **అవుట్‌లైన్‌తో తీర్చిదిద్దినట్టుం**టుంది. కేవలం కాస్ట్‌లీ వ్యక్తుల్ని మాత్రమే పలకరించడానికి ఉద్దేశించినట్టుండే లేజర్ బీమ్ చూపులు, అటువంటి వారి నిరంతరావలోకనంలో మరింత నైశిత్యాన్ని సంతరించుకున్నాయి.






స్వాతికాహారం వారికెంతమాత్రమూ సరిపడనందున, రజోగుణప్రేరకమైన పౌష్టికాహారమే గ్రహించే అలవాటువల్ల తెగబలిసిన దేహం ఆయన్ది. సదా సంతోషాబ్ధిలో ఓలలాడుతూండడంతో, దానికి వింతమెరుపుకూడా తోడైంది. మొత్తంమీద ఆకర్షణీయమైన ఆకృతి, వారికి అయాచితంగావే లభించిన ప్రాకృతిక వరం. అది స్వార్థానికి వినియోగించుకోగలగడాన్ని ప్రశ్నించేందుకు మన మెవరం? "చింతాద్రీ! ఏమిటీ నీ చింత? " కరుణాత్మక దృక్కులు ప్రసరిస్తూ ప్రశ్నించారు పగోబా.

తాము చెంత ఉండగా వాకేల చింత?! వినమ్రతాస్కేల్ లెవెల్ సరిచూసుకుంటూనే సమాధానమిచ్చాడు సి.ఎం.మాజీ దిగ్రేట్.

"గుడ్! నీ మనస్సులోకి సూటిగా చూస్తున్నాను. విషయమేమిటో గ్రహిస్తున్నాను." హిప్నాటిక్ లుక్‌కి ఇకిలింపు మిక్సప్ చేసి అన్నప్పటికీ, గుబురు మీసాల చాటున ఫీలింగ్స్ దర్శనీయం కాలేదు– అక్కడున్న వాళ్లెవ్వరికీ. చింతాద్రి కూడా డిటో. మాటలకి రేషన్‌కోటా విధించుకున్న చింతాద్రి నెక్స్ట్ డైలాగ్ వేస్తాడేమో అని అరనిముషం ఎదుర్చూసి, అతని గొంతు పెగలకపోవడంతో "భక్తపరమాణువా! ఏంటీ...మాట్లాడవ్?" అన్నారు పగోబా.

"సర్వజ్ఞులు! తమకు వేరే చెప్పాలా?" మళ్లీ వినయం లెవెలూ– రేషన్ కోటా టైపు మాటలూ మర్చిపోకుండా అన్నాడు చింతాద్రి.

"అరచేతిలో కైలాసాలూ–వైకుంఠాలు కాదు.....ఆంధ్రప్రదేశ్ చూపిస్తా!"

"ఒహటోక్లాసు టెక్స్టుబుక్ దగ్గర్నించి, హోటేల్లో ఆంధ్రకేసరి కేలండర్ బ్యాగ్రౌండ్‌లోదాకా చాలా చోట్ల చూశా! చూడ్డం కాదు వాక్యావలసినవి–మళ్ళీ అమలుచెయ్యడం పగోబా వంతైంది. కారణం– ప్రస్తుతం పవర్ల ఉన్న సి.ఎం.పొద్దున్నే తవ దర్శనం చేసి వవ్వడు, తాను ముచ్చటపడ్డ పాతికెకరాలూ సుక్షేత్రమైన నాగావళీనదీ పారివాహక ప్రాంతంలో ధారాదత్తంగా సమర్పించుకున్నాడాయె! అంతేనా! ఆ భక్తి పారవశ్యంలో తన ఆశ్రమాన్ని సిన్మా షూటింగ్‌లకు ఇచ్చుకోడానికి వో అబ్జెక్షన్ ప్రసాదించాడు కూడా!

" ఈ పవరు అనేది చక్రభ్రమణం నాయనా! ఎవ్వడూ ఒక్కపార్టీయే అధికారంలో ఉండదు. ఉండరాదు. అది భగవంతుడిరూలు. నీటర్న్ మళ్లీ వస్తుంది. వెయిట్ అండ్‌సీ.....

"ఈ లోపల నావెయిటు సీ షోర్లో కలిసిపోతుంది."

"అయితే, నిన్ను సాధ్యమైనంత త్వరలో సి.ఎమ్.సీట్లో మళ్లీ కూలవెయ్యాలంటావు! అంతేగా! ప్రజల్లో నీ పలుకుబడి పల్స్‌రీడింగ్ అబ్జర్వ్‌చేశావా?"

"దాన్ని. హైపిచ్‌లోకి తీసుకొచ్చే తారక మంత్రమేదో తామే ఉపదేశించాలి!"

"డబ్బు కావాలా?" "తమ దయే వల్ల హవాలా రాకెట్ అద్భుతంగా నడుస్తోంది. కరెన్సీకి కొదవలేదు."

"సడన్‌గా ఎలక్షన్లసీన్ సృష్టిస్తే రిగ్గింగ్ చేసుకోగలవా?" "ఆదెంతపని?దావూద్ మనుషుల దగ్గర్నించి–గల్లీ దాదాలదాకా మన కనుసన్నల్లోనే ఉన్నారు. కాని పదవి ఆ రూట్లో తెచ్చుకోడం పాతఫేషన్."

"మరెలా క్కావాలి"

"ముల్లుని ముల్లుతోనే తియ్యాలి. వెన్నుపోటుని వెన్నుపోటుతోనే ఎదుర్కొవాలి!"

"ఐ.సీ.ఆర్థమైంది. నీ మీద అసమ్మతి కత్తి ఝుళిపించి, నిన్ను సీట్లోంచి లాగి పారేసిన నీ బామ్మర్థి సింగన్నని అదే టైపులో కుర్చీలోంచి ఈడ్చిపారేయాలి...... కదూ!" తలూపాడు చింతాద్రి.

"బల నిరూపణకి నీవెనక ఎమ్మెల్యే లెంతమందున్నారు?"

"వాళ్లబలంకాదు–ప్రజాబలం బహుదండిగా ఉన్న పీఠాధిపతులు తమ బలంతో ఏదైనా సెలవీయండి! "

"ఓ పనిచెయ్! కాదు! కాదు! ఓ యజ్ఞం కాదు. రుద్రయజ్ఞమే! పైకి మాత్రం ప్రపంచశాంతియజ్ఞం అనే కలర్ కోటింగ్ అద్దుతాం!"

"ఏం చేస్తారో మీ యిష్టం! అనక మా ఆఫీషియల్ సెక్రెట్రీ గోపాలానంద్ మిమ్మల్ని కలుస్తాడు. మా స్విస్ ఖాతాలోంచి మీక్కావలసిన అమౌంట్ ట్రాన్స్‌ఫర్ అవుతుంది. అన్నట్టు–అతడు మాకు చాలా నమ్మకస్తుడు. ఎన్నాళ్ళుగానో మీ శిష్యరికం చేద్దామనుకుంటున్నాట్ట! కాస్త కరుణించండి! "

"హమ్మ చింతాద్రీ! నీ కుప్పిగంతులు నాదగ్గరా? అతడు నీ తరఫున సెక్రెట్రీ మాత్రమేనా? లేక సీక్రెట్ ఏజెంట్ కూడానా?" అనుకున్నాడు మనసులో." మావంటి అవతారపురుషుల్ని శంకిస్తున్నావా? సాక్షాత్తు గాడ్ ఉనికినైనా ప్రశ్నించవచ్చుకాని, మాబోటి గాడ్‌మెన్‌ల మీద నీ సెక్రెట్రీని నిఘాకి ప్రిపేర్ చేస్తున్నావంటే......."అంటూ ఆగ్రహించబోయాడు. వెంటనే ఆపదని పసిగట్టేసిన చింతాద్రి, మాటకు అడ్డంపడి–పన్లోపనిగా కాళ్లకీ అడ్డంపడిపోయి" ఓ మహాత్మా! ఓ మహర్షీ! దయ చేసి అపార్థం చేసుకోకండి! నాకే కోశానా అటు వంటి ఊహలేదు. కేవలం మనీ డీలింగ్స్ చూట్టానికే అప్పుడప్పుడు అతడొస్తాడు. తమపై భక్తి ప్రపత్తులనేవి అతడి పర్సనల్ విషయం. నేను కేవలం రికమెండ్ చేస్తున్నానంతే! అతడో ప్రగాఢ డివోటీ. మూఢభక్తి అతడిది! ఒక్క మాటలో –అతడో మూఢమతి అనుకోండి. " అంటూ తెగబారెడు సంజాయిషీ

ఇచ్చుకున్నాడు.

'మూఢమతి' అనే పదం వినగానే ఒక్కసారి ప.గో.బా.ఉలిక్కిపడ్డాడు. ఆలా ఉలిక్కిపడ్డానికోపాడుగాటి ఫ్లాష్‌బ్యాక్ ఉంది. మూఢమతులుగానే ఆశ్రమ ప్రవేశం చేసిన, కొందరు అతిబుద్ధిమంతులు అనంతరకాలంలో అజ్ఞానావస్థ వీటి తమ జ్ఞాన చక్షువులతో ఆశ్రమంలోని రహస్య కార్యకలాపాలన్నీ అతిశ్రద్ధతో పరికించి, అవతలిప్రపంచానికి చేరవేసే దుస్సాహసం చేసేరు. ఒకరిద్దరు ఏకంగా తన ఉనికికే ఎసరు పెట్టసాహసించారు. 'నేను వేరు –జగత్తు వేరు' అనే "ద్వంద్వభావం నశింపజేయడం నాలక్ష్యం–" అని ప్రవచించే పగోబా గారికి ఈ మాయామేయ జగంబు అనిత్యంబు కనుక, జగన్ముక్తి ప్రసాదించబోయారు. అవి పెయిలై పగోబా వారి అవతార పరిసమాప్తికి అడ్డంపడ్డాయి.

అసలా రోజు ఏం జరిగిందంటే.......

"భజగోవిందం, భజగోవిందం–గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే–నహి నహి రక్షతి......" స్టీరియోలోంచి మంద్రంగా భజగోవింద శ్లోకాలు........

'కాలం సంప్రాప్తమైనప్పుడు ఎవరూ రక్షించలేరు' అనే అర్థంలో వేదాంతధార జాలువారుతోంది. ఆశ్రమం ఆవరణలో విడిదిచేసి వున్న దేశవిదేశీ మూఢభక్తుల మత్తుని చిత్తు చేసేసి, మేల్కొల్పుదిశవైపు తిప్పే ఆధ్యాత్మిక చింతనాత్మక కేసెట్లు తమ వంతు కృషి చేస్తున్నాయి. తెల్లవారు ఝామున నాలుగున్నర ప్రాంతం......

పరమాచార్య గోవిందానంద బాబా టెర్రెస్ మీద కొచ్చారు. కేసెట్ ప్లేయర్ దగ్గర కునికిబాట్లు పడుతున్న ఓ మూఢమతి, పగోబా అడుగుల సవ్వడికి కళ్ళు తెరిచి అటెన్షన్‌లో కొచ్చాడు. ప.గో.బా.ఆ సమయంలో డాబా మీద పచార్లు చేయడం రోజూ జరిగేదే!

"ప్రతి ప్రభాతవేశా ఓ కొత్త ఉత్సాహరిమీలో వెల్లివిరుస్తుంది. సూర్యోదయావం టబట్టించుకున్న సదరు కార్యకర్త మరింత అడ్వాన్స్ అయి, ఆశ్రమంలో లీలలన్నీ వెయ్యికళ్లతో జాగ్రత్తగా కనిపెట్టివున్నాడు. కొన్ని విపరీతాలకు అతడు దిగ్భ్రాంతి చెందాడు...... మరికొన్నిటికి ఆవేశపడ్డాడు....... ఇంకొన్నిటికి ఏవగించుకున్నాడు......

అయినా అవన్నీ వేదాంతం ముసుగులో–భక్తి పారవశ్యం అనే పరదాల మాటున ఎప్పటికప్పుడు భూస్థాపితం అయిపోతూండడం: మరి కొందరు భక్తులు కొత్తగా పీఠంలోకి చేరిపోతూండడం అతడ్ని కలవరపరిచింది.

దీనికి తప్పనిసరిగా చరమ గీతం పాడాలనుకున్నాడు– ఎంతో యోచించిన మీదట. మాస్ మెస్మరిజం తప్ప ఏముందీ అరాచక స్వాములారిలో? ఎందుకింత మందిని మరింత అజ్ఞానావస్థలోకి తోస్తున్నాడీ పీఠాధిపతి....? వ్యక్తిపూజకి పట్టంకట్టి, అనాగరిక–అచేతనా వస్థలోకి రానురానూ సమాజం దిగజారిపోతూన్నదా?.....

–ఇలాంటి ప్రశ్నలు ఉత్పన్నమైనప్పటి నుంచి, అతడిలోని అసలైన జిజ్ఞాసాపరుడు నిజంగా నిద్రలేవడం ప్రారంభించాడు.

"నశ్వర మిది–నాటక మిది– మూణ్ణాళ్ళ ముచ్చటైన జీవితమిది–శాశ్వతమనుకొని పాకులాడుతారెందుకు?".......ఇలాంటి ప్రవచనాలకేగా డాలర్లతో సహా దేశదేశాల కరెన్సీ కట్టలుకట్టలుగా వారి కరచరణాల ముందు వర్షంలా కురిసింది. "కోరిక" అనేది విడిచిపెడితే ధనికుడెవరు? దరిద్రుడెవరు? అంతా సమానమే! కాని కోరికకే అవకాశం ఇస్తే !? అది నెత్తి కెక్కి దాస్యం చేయించుకుంటుంది......." అక్షరలక్షల విలువైన ప్రసంగాలంటూ, ఫారిన్ డివోటీస్ తమసర్వస్వం వదిలేసి ఆయన ముందు సాగిలపడ్డారు. "భగవంతుడు మానవుడికిచ్చిన దివ్యమైన వరం ఈ జీవితం. దీనిని ప్రశాంతంగా గడపండి. అనుభవించవలసిన జీవితాన్ని హాయిగా అనుభవించండి!......" ఆడభక్తులకి–సన్యాసినులకి బాగా 'అనుభవం'లోకి వచ్చింది.

లోపాయికారీగా కొందరికి అబార్షన్లు తప్పలేదు. అయినా ఎవరూ పెదవివిప్పలేదు. ఆశ్రమ ప్రవేశం అంటూ ఒకసారి జరిగాక, ఇకవేర్వేరు ప్రాంతాలు– వేర్వేరు వ్యక్తులు అనే భావన రానీయకూడదు. దానికి అక్కడిరూల్స్ ఒప్పుకోవు. మనిషికి దైవత్వాన్ని ఆపాదించి, పిచ్చిగా కొలిచే మూర్ఖత్వంలో మనిషి పడ్డప్పట్నుంచీ మఠాలూ– ఆశ్రమాలు ఎక్కువైపోయేయి. దైవాంశసంభూతులు విపరీతంగా పుట్టుకొచ్చేరు.' జరా మరణాలకు అతీతమైనది కదా దైవత్వం' అనే అతి సామాన్య స్పృహ అక్కడ చేరే మానవమాత్రుడికి కలగనివ్వకుండా జాగ్రత్తపడడంలో ఈ పరమాచార్యుల కౌటిల్యం ప్రశంసాపాత్రమే! అందుకోసమైనా వాళ్లకి 'సువర్ణపుష్పాభిషేకం' చేయొచ్చు!


ఆ వైభవమూ జరగకపోలేదు. విచక్షణా శూన్యులైన మూఢభక్తులు కొందరు నిజంగానే పరమాచార్యులవారిని సువర్ణంలో ముంచెత్తారా మధ్య..

పగోబా గారి షష్టిపూర్తి సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆరోసారి కనకాభిషేకం జరిగింది........

దాదాపు ఐదు కిలోల బంగారం వినియోగించారు. విదేశీభక్తులు ఆనందపారవశ్యంతో విరివిగా విరాళాలిచ్చారు.....

ఆశ్రమం రిలీజ్ చేసిన ప్రెస్ నోట్‌ప్రకారం 'లక్షలాది భక్తులు అత్యంత వైభవంగా ఈ కార్యక్రమాన్ని తిలకించారు.'

స్టాఫ్‌ప్రెస్ నోట్ ప్రకారం ' పగోబా వారి పవిత్ర కరస్పర్శకోసం ముద్దుగుమ్మలు పులకించిపోయి ఒకర్నొకరు తోసుకున్నారు.



వారంతా తమకంతో మూకుమ్మడిగా పరమాచార్యగోవిందానంద బాబా వారిమీద పడిపోగా, మీరు ప్రతి ముద్దుగుమ్మనీ బుజాలు పట్టి లేవనెత్తి సాదరంగా ఉద్ధరించేరు. కొందర్ని అర్ధరాత్రి వరకూ అనుగ్రహించేరు. తనను ముంచెత్తిన నిలువెత్తు బంగారాన్నీ ఆశ్రమ ఆవరణలోనే అత్యం తనమ్మకస్తులైన అనుచరుల చేత కరిగించి మదింపు చేయించి స్విస్‌బ్యాంక్ ఖాతాకి జమ కట్టించేరు.

అవన్నీ ప్రత్యక్షంగా చూసిన సదరు జాగృత కార్యకర్త దీర్ఘంగా నిట్టూర్చి, క్యాసెట్ మారుస్తున్నట్టు నటిస్తూనే అడ్వాన్స్‌గా రెడీ చేసి పెట్టుకున్న సైలెన్సర్ పిస్టల్‌ని క్యాసెట్ డెక్ వెనక నుంచి లాఘవంగా అందుకుని పగోబాకి గురిపెట్టాడు. మరుక్షణంలోనే మర్డర్ అయిపోయేవాడే–ఆ 'మానుషరూప దైవాంశసంభూతుడు.'

అయితే– అదృష్టం బాగుండి, పగోబాకి అర్జెంటుగా 'లఘుశంక' కెళ్ళవలసి రావడం: గబగబా మెట్లు దిగిపోవడంతో గుండుగురి తప్పింది. (ఆయనకి అతిమూత్రవ్యాధి కూడా వుంది– దేహాన్ని ధరించినందుకు దేవుడికైనా ఈతిబాధలు తప్పవుగదా!)

అక్కడికి కొద్ది దూరంలోనే వున్న బిల్డింగ్ కిటికీలోకి దూసుకుపోయిన గుండు, ఓ అభాగ్యభక్తుడి ప్రాణం బలిగొనడం, అది కలకలం రేపడంతో "పగోబాపై హత్యాయత్నం" వార్తాశీర్షికై–కొన్ని పేపర్ల బ్యానర్ హెడ్డింగై బయటిప్రపంచానికి వెళ్లకున్నాయి. అయినా ఆశ్రమం రూల్స్ ప్రకారంఅవి బయటికి పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. "నన్నెవరూ హత్య చెయ్యలేరు. నా చావు నా చేతిలో వుంది." పేపర్ స్టేట్‌మెంటిచ్చారు పగోబా.

కలకలం సృష్టించిన ఈ హత్యకేసుకి ఇటు మామూలు జనంలోనూ– అటు రాజకీయ వర్గాల్లోనూ అత్యంత ప్రాధాన్యత వచ్చేసింది. కారణం–కేంద్ర రాష్ట్ర రాజకీయ పక్షుల్లో సవాలక్షమంది గోవిందానందులవారి పాదధూళి నెత్తిన జల్లుకున్నవారే! జల్లుకుంటున్నవారే!

హత్యాయత్నం చేయబోయిన మూఢమతి జాగృత ధోరణికి విస్తుబోయిన పగోబా మూడోకంటికి తెలీకుండా, ఆ విశ్వాసఘాతకుడికి 'ఆశ్రమ లాకప్‌డెత్' ప్రసాదించేరు.

ఆధ్యాత్మిక వ్యాపారం ఎప్పటిలాగే మూడు శోభనాలూ– ఆరు స్వర్ణాభిషేకాలూగా విలసిల్లుతోంది. ఫ్లాస్ బ్యాక్ అంతా ఒక్కసారిగా పగోబా కళ్లముందు గిర్రున తిరగడంతో, "మూఢమతులూ– నిగూఢమతులూ ఎవ్వర్నీ అనుమతించం చింతాద్రీ" అన్నాడు. ఆవేశంగా. నా యావదాస్తీ సూటుకేసుల్లో అతడి ఆధీనంలోనే వుంది. ఎంత నమ్మకస్తుడు కాకపోతే, అతనింట్లో వుంచుతాను చెప్పండి! రేపెప్పుడైనా ఏ ఇన్‌కంటాక్స్ రెయిడింగో జరిగినా, మన్దగ్గిరేం దొరుకుతుంది–బూడిద?" అన్నాక కాస్త స్థిమిత పడి అతడి ప్రవేశానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు పగోబా. నమ్మకం కలిగించడంలో అపర ఆషాడభూతి అనదగ్గ గోపాలానంద్, అచిరకాలంలోనే పగోబా ఆంతరంగిక శిష్యశ్రేణిలో అగ్రగణ్యుడయ్యాడు. వారిక్కావలసినవి చూసుకోవడంలో అందర్నీ మించిపోయాడు.'అత్తసొమ్ము–అల్లుడుదానం' చందాన చింతాద్రి డబ్బు తన దగ్గరుంచిన దాంట్లోంచి యధేచ్ఛగా పగోబా వరం చేస్తూ, యజ్ఞం ఖర్చు ఖాతా రాసేయసాగాడు గోపాలానంద్. 'మంత్రాలకి చింతకాయలు రాలనట్టే ,' చింతాద్రికి పదవీయోగం పట్టనూ లేదు. అతడిచింత తీరనూలేదు. కాని......

పగోబా ఆయువుపట్టన్నీ గోపాలానంద్‌కి వొంటబట్టాయి. ఆశ్రమం అంతఃపుర రహస్యాలు బాగా అవగతమయ్యాయి. అతడు తిరిగి చింతాద్రి దగ్గరికి అఫీషియల్ సెక్రెట్రీగా వెళ్లలేదు. వెళ్లాల్సిన అవసరం కలగలేదు. "సృష్టితత్వాన్ని యదార్థంగా గ్రహించగల తత్వవేత్తలు, ఈ మాయామేయ జగత్తు అంతటా వ్యాపించిన చైతన్యం ఒక్కటే శాశ్వతం అంటారు." పగోబా ప్రవచనం అది. వారి దృష్టిలో–సృష్టి తత్వం అంటే.......వేషధారణా, ఈ ప్రవచనధోరణీ వగైరా.......దీన్నంతటినీ యదార్థంగా–యథాతథంగా గ్రహించిన గోపాలానంద్‌కి ఓ శాశ్వతమైన నిజం బోధపడింది. అదేమిటంటే–"ప్రజల్లో మహా మూఢత్వం అనే భక్తి భావం నిత్య చైతన్యవంతమైనది. అది అలా ప్రవర్థమాన మవుతూ వుంటుంది. శాశ్వతంగా వుంటూనే వుంటుంది. వారి మూఢత్వమే పగోబా వంటివారికి పరమాత్మ రక్షలా పనిచేస్తుంది....."అని. ఆ నిజం బోధపడగానే, అతడు గురువును మించిన శిష్యుడిగా ఎదగసాగాడు. తన విశ్వరూపం ప్రదర్శించడానికి సైతం వెనకాడలేదు. గురువుగార్ని కార్నర్ చేయడానికి ప్లాన్స్ రెడీ చేసుకున్నాడు. అవకాశం కోసం కాచుక్కూర్చున్నాడు.

వారి వారసత్వాన్ని స్వీకరించడానికి తనకే అర్హత వుందని– తానే అనుంగుశిష్యుణ్ణనీ ప్రచారం చేసుకోవడమే కాక 'సువర్ణ పాద పూజ' సైతం స్వంత ఖర్చుతో జరిపించేసుకోవడం ప్రారంభించాడు. పగోబాకి వార్థక్య వశాన వచ్చిన అనారోగ్యాన్ని సాకుగా తీసుకుని తన పథకం అమలు చెయ్యడానికి శ్రీకారం చుట్టేశాడు.

(కాంతాకనకాల ఒత్తిళ్లకు కుళ్లిపోయిన) శ్రీవారి దేహానికి అత్యవసర చికిత్స అవసరమన్నాడు. విదేశీ అనుయాయుల సహకారంతో శ్రీవారివుచ్చిన శరీరాన్ని స్పెషల్ ప్లేన్‌లో కాలిఫోర్నియా చేర్చేశాడు. బ్రతుకు భయం పట్టుకున్నది పగోబాకి.

